సాక్షి ఆదిలాబాద్

గురువారం । 2 । జనవరి । 2025



సమయానికి చేరదేమి..!

హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్, నిర్మల్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సులు నిత్యం ఆలస్యంగా గమ్యాన్ని చేరుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పట్లేదు. 8లో▸



బాసరలో భక్తుల రద్దీ

బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే బారులుదీరారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
27.0/12.0

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి వేళలో చలి, వేకువజామున పొగమంచు ప్రభావం కనిపించనుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఎస్పీని కలిసిన ఉట్నూర్ ఏఎస్పీ



ఎస్పీకి పూలమొక్క అందజేస్తున్న ఏఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: ఉట్నూర్ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కాజల్ బుధవారం జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కలిసి పూలమొక్క అందజేశారు. గ్రేహౌండ్స్‌లో పనిచేసిన ఈమె ఉట్నూర్ ఏఎస్పీగా బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల విషయంలో గతంలో నెలకొన్న సమస్యలు, ప్రస్తుత స్థితిగతులపై ఇరువురు అధికారులు చర్చించారు.

సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె



శిబిరంలో బైఠాయించిన కార్మికులు

కైలాస్‌నగర్: కూలి రేట్ల ఒప్పంద జీవో వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేస్తూ సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు సమ్మెకు దిగారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో గల ఎంఎల్‌ఎస్ పాయింట్ గోడౌన్ ఎదుట చేపట్టిన సమ్మెను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ కార్మికులకు పూల మాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో సివిల్ సప్లయి హమాలీలతో రాష్ట్ర కమిషనర్ ఒప్పుకున్న రెట్ల ఒప్పంద జీవో వెంటనే విడుదల చేసి 01.01.2024 నుంచి అమలు చేసి ఏరియర్స్‌తో కలిపి ఇవ్వాలని కోరారు. అలాగే హమాలీ కార్మికులకు స్వీపర్లకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

'రహదారి భద్రత' తప్పనిసరి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్



మాట్లాడుతున్న ఆర్ఎం సోలోమన్

ఆదిలాబాద్: ఆర్టీసీ డ్రైవర్లు రహదారి భద్రత నియమాలను తప్పకుండా పాటించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. ఆదిలాబాద్ డిపోలో బుధవారం ఏర్పాటు చేసిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల సంఖ్య తగ్గుతుందన్నారు. డ్రైవర్లు వాహనాన్ని నడుపుతున్నప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీఆర్ఎం ప్రవీణ్, ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో టీపీయూఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్‌కుమార్, గోపీకృష్ణ, సంఘ బాధ్యులు నారాయణ, గోమంత్‌రెడ్డి, జీజబాయి, రాజ్‌కుమార్, గంగాదర్, ఉపేందర్, విఠల్ రావు పాల్గొన్నారు.

ముందడుగేది?

- పత్తి కొను'గోల్‌మాల్' విచారణలో జాప్యం
- ఆ రైతుల వివరాల సమర్పణలో నిర్లక్ష్యం
- రూ.20లక్షలకు పైగా విక్రయాలపై తొలగని సందిగ్ధం
- సీసీఐ విజిలెన్స్ వివరాలు కోరి పది రోజులు దాటినా నో రెస్పాన్స్
- ఆదిలాబాద్ ఏఎంసీ అధికారులకు సమయం దొరకట్లేదట!
- మార్కెటింగ్, సీసీఐ అధికారుల పాత్రపై అనుమానాలు



ఆదిలాబాద్ పట్టణంలోని జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు (ఫైల్)

> గుడిహత్నూర్‌కు చెందిన ఓ మహిళ నవంబర్‌లో 12 సార్లు, డిసెంబర్‌లో రెండు సార్లు మొత్తంగా 14 సార్లు సీసీఐకి పెద్ద మొత్తంలో పత్తిని విక్రయించారు. ఇందులో ఆదిలాబాద్ ఏఎంసీలో 13 సార్లు, ఇంద్రవెల్లిలో ఒకసారి పత్తిని అమ్మారు. చాలా సార్లు ఒకే నంబర్‌కు చెందిన వాహనంలో పత్తిని తీసుకువచ్చారు. దీంతో అసలు ఈ మహిళ రైతేనా.. లేనిపక్షంలో ఇలా మధ్యవర్తిలా పత్తిని విక్రయించుకొని మద్దతు ధర ప్రయోజనం పొందారా అనేది సీసీఐ విజిలెన్స్ అధికారులకు వచ్చిన అనుమానం. ఇలాగే పెద్ద మొత్తంలో పత్తిని విక్రయించిన పలువురు రైతులకు సంబంధించి వివరాలను ఆరా తీస్తున్నారు. మొత్తంగా జిల్లాలో పత్తి కొనుగోళ్ల పరంగా అసలు రైతులే మద్దతు ప్రయోజనం పొందుతున్నారా, లేనిపక్షంలో వ్యాపారులు, మధ్య దళారులు ఆ ప్రయోజనాలు అందుకుంటున్నారా అనే అనుమానాలు కలగక మానదు.

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో ఇటీవల ఐదుగురిలో ఒక్కొక్కరు రూ.20 లక్షలకు పైగా విలువైన పత్తిని విక్రయించారు. ఇంత పెద్ద మొత్తం అమ్మిన వీరు నిజమైన రైతులేనా.. లేనిపక్షంలో మధ్యవర్తులా.. మద్దతు ధర ప్రయోజనం అర్హులైన రైతులకే దక్కిందా.. అనే విషయంలో భారత పత్తి సంస్థ (సీసీఐ) విజిలెన్స్ అధికారులకు అనుమానం వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై 'సాక్షి'లో సోమవారం 'పత్తి కొనుగోళ్లలో గోల్‌మాల్' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఆ ఐదుగురు రైతులకు సంబంధించిన వివరాలు అందజేయాలని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులను సీసీఐ విజిలెన్స్ డిసెంబర్ 19న కోరింది. అయితే ఆ వివరాల సమర్పణలో అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోంది. మాకు సమయమే దొరకడం లేదనే సమాధానం ఈ ఏఎంసీ అధికారుల నుంచి వస్తుంది.

అనుమానం ఎక్కడొచ్చింది..

జైనథ్ మండలం తరోడాకు చెందిన ఒకరు 266 క్వింటాళ్లు, తలమడుగు మండలం నందిగామకు చెందిన మరొకరు 280, ఆదిలాబాద్‌అర్బన్‌కు చెందిన ఒకతను 336, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జందాపూర్‌కు చెందిన ఇంకో అతను 306, గుడిహత్నూర్‌కు చెందిన ఓ మహిళ 312 క్వింటాళ్ల పత్తిని సీసీఐకి విక్రయించి మద్దతు ధర పొందారు. ఇంత పెద్ద మొత్తంలో పత్తిని విక్రయించిన ఈ రైతులకు సంబంధించి ఆ విలువ ఒక్కో రైతుకు సంబంధించి రూ.20లక్షలకు చేరువలో, అంతకు పైబడి ఉండడంతో సీసీఐ విజిలెన్స్‌కు వీరు నిజమైన రైతులేనా అనే అనుమానం వచ్చింది. దీంతో డిసెంబర్ 19న ఆదిలాబాద్ ఏఎంసీ అధికారులను ఆ రైతులకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఈ సీజన్‌లో ఎకరాకు పత్తి దిగుబడి 8 క్వింటాళ్లను మించలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఈ రైతులకు వారి భూముల్లో ఇంత పెద్ద మొత్తం పత్తి సాగైందా అనే విషయంలో అనుమానాలు తలెత్తుతున్నాయి. మహారాష్ట్రకు చెందిన రైతులు స్థానికంగా ఇక్కడి తమ బంధువులైనటువంటి రైతుల పేరిట పత్తిని విక్రయించారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కొంత మంది మహారాష్ట్ర రైతులు జిల్లాకు చెందిన రైతుల పేరిట పట్టాపాస్‌బుక్‌లు తీసుకొచ్చి ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో విక్రయించారనే ఆరోపణలున్నాయి. మొత్తంగా పత్తి కొనుగోళ్లలో గోల్‌మాల్‌పై అనుమానాలు మొదలయ్యాయి. గ్రామాల్లో పలువురు రైతులు కూలీలకు కూలి ఇచ్చేందుకు గాను చేతికొచ్చిన దిగుబడిలో కొంత మొత్తాన్ని స్థానికంగా ఎలాంటి లైసెన్స్ లేని వ్యాపారులకు విక్రయించడం జరుగుతుంది. ఇలాంటివి నార్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఇచ్చోడ మండలాల్లో పలు సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఇలా జమ చేసిన పత్తిని మార్కెట్ యార్డులో మద్దతు ధరకు వ్యాపారులు విక్రయించి ప్రయోజనం పొందుతున్నారనే ఆరోపణలు బాహాటంగానే వ్యక్తమవుతున్నాయి.

మార్కెటింగ్, సీసీఐ అధికారులు మిలాఖత్ అయ్యారా..

పత్తి కొనుగోళ్లలో రైతుల పేరిట మధ్యవర్తులు విక్రయించి మద్దతు ధర ప్రయోజనం పొందుతున్నారని సీసీఐ విజిలెన్స్‌కు అనుమానం వచ్చిందంటే ఈ వ్యవహారంలో ఇటు మార్కెటింగ్, అటు సీసీఐ అధికారులు మిలాఖతైతేనే మార్కెట్ యార్డులో ఏదైనా అక్రమ వ్యవహారం చోటుచేసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఒకవేళ అలా జరిగి ఉంటే దానికి మార్కెటింగ్ శాఖాధికారులతో పాటు సీసీఐ అధికారులది కూడా బాధ్యతే. సాధారణంగా ఒక పత్తి బండి మార్కెట్ యార్డుకు వచ్చినప్పుడు దానికి సంబంధించి తేమ పరిశీలనతో పాటు ఆ రైతు వివరాలు, పత్తి నాణ్యత, పత్తి బరువును మార్కెటింగ్, సీసీఐ సిబ్బంది, అధికారులు పరిశీలించిన తర్వాతే దానికి సంబంధించి తక్‌పట్టీ రూపొందుతుంది. ఇలాంటప్పుడు ఇంత పెద్ద మొత్తంలో ఒకవేళ మధ్యవర్తులు పత్తిని అమ్ముకుంటే దానికి సీసీఐ, మార్కెటింగ్ అధికారులది ఇరువురు బాధ్యత వహించాల్సి ఉంటుంది. పెద్ద మొత్తంలో జరిగిన పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ విజిలెన్స్ వింగ్‌కు అనుమానం రావడంతో క్షేత్రస్థాయి నుంచి ప్రస్తుతం వివరాలను కోరింది. దీంట్లో మార్కెటింగ్, సీసీఐ అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏ వివరాలు అడిగారు..

వందల క్వింటాళ్ల పత్తిని విక్రయించిన వారికి సంబంధించి అనుమానం వచ్చి ఈ వివరాలు కావాలని సీసీఐ విజిలెన్స్ మార్కెటింగ్ శాఖ అధికారులను కోరింది. దాంట్లో ఆయా రైతులకు సంబంధించి ఎంత భూమి ఉందనే వివరాలు.. ఆ భూమిలో ఏ పంట వేశారు.. ఎకరానికి సగటు దిగుబడి ఎంత వచ్చింది.. 2024–25 ఏఎంసీ రికార్డుల ప్రకారం ఆ దిగుబడిని మార్కెట్ యార్డులో విక్రయించుకునేందుకు అర్హత ఉందా.. ఆ దిగుబడిని విక్రయించినప్పుడు ఆ రైతే క్షేత్రస్థాయిలో ఉన్నాడా, లేనిపక్షంలో అతని కుటుంబ సభ్యులు ఎవరైన ఉన్నారా.. ఒకవేళ కుటుంబ సభ్యులు ఉంటే వారికి సంబంధించి ఐడీ ప్రూఫ్ ఉందా.. మద్దతు ధర ప్రయోజనం నిజమైన రైతుకే దక్కిందా.. లేనిపక్షంలో మధ్యవర్తి ఎవరైనా ఉన్నారా.. ఈ వివరాలన్ని పంపించాలని కోరారు. అంతే కాకుండా అదనంగా ఏదైనా సమాచారం ఉంటే కూడా పంపించాలని అడిగారు. అయితే మార్కెటింగ్ అధికారుల్లో ఇప్పటివరకు ఈ విషయంలో చలనం రాలేదు. సీసీఐ విజిలెన్స్‌కు ఆ వివరాలను పంపించలేదు. ఈ విషయంలో మార్కెటింగ్ అధికారులను 'సాక్షి' వివరణ కోరితే.. అంతా సవ్యంగా ఉందనే ఒకేమాట చెప్పారు. ఎలాంటి అనుమానాలు పడొద్దన్నారు. అయితే అధికారుల ఈ మాటలు అనుమానాలకు తావిస్తున్నాయి.

> **డేటా ఉండడంతోనే కొనుగోలు చేశాం..**
>
> రైతులకు సంబంధించి ఏఎంసీ డేటాలో వివరాలు ముందే నమోదై ఉండడంతోనే వారి దిగుబడులను కొనుగోలు చేశాం. ఆ రైతులను పట్టాపాస్‌బుక్, ఇతర వివరాలను తీసుకురావాలని కోరినప్పటికీ ఇప్పటివరకు రాలేదు. వివిధ సమావేశాల కారణంగా కొంత బిజీగా ఉండడంతో ఆ వివరాలను ఇంకా సేకరించలేదు. త్వరలోనే సీసీఐకి అందజేస్తాం.– మధుకర్, మార్కెట్ కార్యదర్శి, ఆదిలాబాద్

నూతన ఆశలు.. ఆశయాలతో

- ఈ ఏడాది ముందుకు సాగాలి
- అందరికీ శుభాలు చేకూరాలి
- జిల్లా వాసులకు కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేల 'న్యూ' విషెస్

నూతన సంవత్సరంలో అందరికీ శుభాలు చేకూరాలని, కొత్త ఆశలు.. ఆశయాలతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంతో పాటు ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్ అన్నారు. ఈ ఏడాదిలో తలపెట్టిన ప్రతీ కార్యం సక్సెస్ కావాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. జిల్లా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. జిల్లావాసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. న్యూ ఇయర్ సందర్భంగా వారి అభిప్రాయాలు ఇలా..

– ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్

• అర్హులందరికీ సంక్షేమ పథకాలు



నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలంతా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాం. యువత, విద్యార్థులు సన్మార్గంలో ముందుకు సాగాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా కృషి చేస్తాం. ఏజెన్సీ ప్రాంతాల్లో రక్తహీనతను అధిగమించేలా అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో 85 న్యూట్రిషియన్ గార్డెన్లు ఏర్పాటు చేశాం. ఈ ఏడాది వాటి సంఖ్య మరింత పెంచుతాం. విద్యార్థుల ఆరోగ్యం కాపాడేలా త్వరలోనే వైద్య శిబిరాలు ప్రారంభిస్తాం. రైతులకు విత్తన, ఎరువుల కొరత రాకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటాం. మహిళాశక్తిని పకడ్బందీగా అమలు చేస్తాం. సీఎస్ఆర్ నిధులతో పీవీటీజీ, ఆదివాసీ గ్రామాల్లోని ప్రజల సంక్షేమానికి చర్యలు తీసుకుంటాం. ఆరోగ్య పాఠశాల, కళాశాల కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నాం. దీన్ని యూపీఎస్‌లకు విస్తరిస్తాం. ఈ ఏడాది డీఎస్సీతో పాటు వివిధ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువడే అవకాశమున్నందున యువత సమయం వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా సాగుతుంది. నిబంధనల మేరకు అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేస్తాం. – రాజర్షి షా, కలెక్టర్

• ప్రజల భద్రతే ముఖ్యం



జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉక్కుపాదం మోపుతాం. గంజా యి, మాదకద్రవ్యాల నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపడతాం. రహదారి ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక దృష్టి సారిస్తాం. మహిళలు, యువతుల భద్రత కోసం చర్యలు తీసుకుంటాం. పోలీసుల ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. సైబర్ క్రైమ్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్ష్యం సాధన దిశగా ముందుకు సాగాలి.

– గౌస్ ఆలం,ఎస్పీ

• నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నా. ఇటీవల శాసన సభలో ప్రస్తావించిన పలు అంశాలు పరిష్కారం అయ్యాయి. గురుకుల పాఠశాలకు సంబంధించి మెస్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సును పరిగణలోకి తీసుకోవాలని ప్రస్తావించగా, ఆమోదించారు. నియోజకవర్గంలోని ప్రతీ పంట పొలాలకు రోడ్లు వేయించేలా కృషి చేస్తాను. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు చర్యలు చేపడతాను. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తాను. రుణమాఫీ, రైతు భరోసా ఇచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తాను. ప్రజల పక్షాల ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తాను.

– పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

• అన్ని గ్రామాలకు రోడ్లు..



బోథ్ నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నా. అన్ని గ్రామాలకు రోడ్లు, మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నా. రూ.150 కోట్లతో గతేడాది అభివృద్ధి పనులు చేపట్టాం. 30 చొప్పున పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను నిర్మించాం. ఇచ్చోడ, కరంజి, బండల్‌నాగాపూర్, కప్పర్ల, రాజురా గ్రామాల్లో రోడ్ల నిర్మాణం పూర్తయింది. కొత్తగా సిరిచెల్మ నుంచి పెంబి, ఇచ్చోడ నుంచి కేస్లాపూర్, అడెల్లి రోడ్డు నిర్మించేలా చర్యలు చేపడుతున్నాం. గ్రామాల్లో త్రీఫేజ్ కరెంట్, బ్రిడ్జి నిర్మాణాలు, కొత్త చెరువులు, ప్రాజెక్టులు నిర్మించేలా చర్యలు చేపడుతున్నా. బరంపూర్, సిరిచెల్మ, కైలాస్ టేక్డి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా. కొత్త మండలం సొనాల అభివృద్ధికి చర్యలు చేపడతా. నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చూస్తా. అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి కోసం ముందుకు సాగుతా. – జాదవ్ అనిల్‌కుమార్, బోథ్ ఎమ్మెల్యే

వీఆర్వోలు సై.. వీఆర్ఏలు నై

- మాతృశాఖకు వెళ్లేందుకు భిన్న అభిప్రాయాలు
- ముగిసిన ఆప్షన్ల గడువు
- జిల్లాలో 187 మంది దరఖాస్తు



జిల్లాలో వివిధ శాఖల్లో సర్దుబాటు అయిన వీఆర్వో, వీఆర్ఏల వివరాలు

కేటగిరీ	శాఖలు	సంఖ్య
వీఆర్వోలు	25	110
వీఆర్ఏలు	18	325

కైలాస్‌నగర్: రాష్ట్రంలో రెవెన్యూశాఖకు పూర్వవైభవం తీసుకురావాలని కాంగ్రెస్ సర్కారు సంకల్పించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో వివిధ శాఖల్లో సర్దుబాటైన వీఆర్వోలు, వీఆర్ఏలను తిరిగి మాతృశాఖకు తిరిగి తీసుకురావాలని నిర్ణయించింది. ధరణి పోర్టల్‌లో మార్పులు చేసిన ప్రభుత్వం ప్రతి గ్రామానికో రెవెన్యూ అధికారి (వీఎల్ఓ)ని నియమించాలని భావిస్తోంది. ఈ మేరకు ఆసక్తి కలిగిన వారు డిసెంబర్ 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా 187 మంది తిరిగి మాతృశాఖకు వచ్చేందుకు ఆప్షన్లను అందజేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) ఉత్సాహాన్ని కనబర్చగా వీఆర్ఏలు మాత్రం సొంత శాఖకు వచ్చేందుకు అంతగా ఆసక్తి కనబర్చకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఆప్షన్ల గడువు ముగియడంతో రెవెన్యూపై ఆసక్తి చూపిన వారంతా సంక్రాంతిలోపు తిరిగి సొంత శాఖలో విధుల్లో చేరే అవకాశముంది.

ఇతర శాఖల్లో సర్దుబాటు జరిగిందిలా..

రెవెన్యూశాఖకు పట్టుకొమ్మగా పరిగణించబడే వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఆ శాఖలో పనిచేసే వీఆర్వో, వీఆర్ఏలను వారి అర్హతల ప్రకారం నాడు వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. తొలుత 2022 ఆగస్టు1న జిల్లాలోని 110 మంది వీఆర్వోలను అప్పట్లో 25 ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేశారు. తర్వాత 2023 ఆగస్టు 10వ తేదీన వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. వారి విద్యార్హతల ఆధారంగా 325 మందిని క్రమబద్ధీకరించిన ప్రభుత్వం 18శాఖల్లో వారిని సర్దుబాటు చేసింది. ఇందులో అత్యధికంగా 197 మంది వీఆర్ఏలను మాతృశాఖ రెవెన్యూలోనే బాధ్యతలు అప్పగించారు. సర్దుబాటు చేసిన వీఆర్ఏలను తిరిగి రెవెన్యూకు తిరిగి తీసుకోవచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకోసం గత నెల 28వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లను స్వీకరించింది.

> **వీఆర్ఏల అనాసక్తి**
>
> గడువు ముగిసిన తర్వాత జిల్లాలో వీఆర్వో, వీఆర్ఏలు రెవెన్యూశాఖకు వచ్చేందుకు ఎంత మంది ఆప్షన్లు అందించారనే వివరాలను ప్రభుత్వం కలెక్టర్‌కు పంపించింది. రెవెన్యూ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. సొంత శాఖకు వచ్చేందుకు వీఆర్ఏలు అంతగా ఆసక్తి చూపనట్లుగా తెలుస్తోంది. 325 మంది వీఆర్ఏలు వివిధ శాఖల్లో సర్దుబాటు కాగా అందులో కేవలం 78 మంది మాత్రమే తిరిగి మాతృ శాఖలో చేరేందుకు సుముఖంగా ఉన్నారు. మిషన్ భగీరథ, విద్యాశాఖ, సాగునీటి పారుదల శాఖల్లో సర్దుబాటు అయిన వీఆర్ఏలు తిరిగి రెవెన్యూకు వచ్చేందుకు విముఖత వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. రెవెన్యూ శాఖ కంటే తమ విద్యార్హతల ప్రకారం ఆయా శాఖల్లోనే త్వరితగతిన పదోన్నతులు లభించే అవకాశముండటంతో వారు తిరిగి రెవెన్యూకు వచ్చేందుకు అంతగా ఆసక్తి చూపలేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే వీఆర్వోలు మాత్రం రెవెన్యూశాఖపైనే తమ మమకారాన్ని చాటుకున్నారు. వివిధ శాఖల్లో 110 మంది సర్దుబాటు కాగా అందులో ఇద్దరు మృతి చెందారు. మిగతా 108 మంది వివిధ శాఖల్లో పనిచేస్తుండగా వారంతా తిరిగి రెవెన్యూలో చేరేందుకే ఆసక్తి చూపించారు. ఆప్షన్లను అందజేసిన వారందరికి సంక్రాంతిలోపు నియామక ఉత్తర్వులు అందించే అవకాశముందనే ప్రచారం సాగుతోంది.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



రెవెన్యూ ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్:నూతన సంవత్సరం పురస్కరించుకుని పలువురు జిల్లాస్థాయి అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల,ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కలెక్టర్ రాజర్షి షాను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన క్యాంపు కార్యాలయంలో కలిసిన ఆయా సంఘాల ప్రతినిధులు,అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు, బ్లాంకెట్లు, నోట్‌బుక్‌లు, డిక్షనరీలు, పెన్నులు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియా, జెడ్పీ సీఈవో జి.జితేందర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేశ్, ట్రాన్స్‌కో ఎస్ఈ జేఆర్ చౌహాన్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య, కలెక్టరేట్ ఉద్యోగులు, టీఎన్జీవోస్, టీజీవోస్ సంఘాల నాయకులు, తదితరులు కలెక్టర్‌ను కలిశారు. కాగా రెవెన్యూ ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసిన కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన డైరీ, క్యాలెండర్లను సంఘం ప్రతినిధులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.

'సెల్ఫీ విత్ సీఎం..'

- కొనసాగుతున్న 'సమగ్ర' నిరసన



సెల్ఫీ తీసుకుంటూ నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో 'సెల్ఫీ విత్ సీఎం' పేరిట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగులు సెల్ఫీలు దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే సమగ్ర ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలోఉద్యోగులు కవిత, అర్చన, హిమబిందు, దీప్తి, సువర్ణ, ప్రశాంత్ రెడ్డి, కేశవ్, స్వప్న, దేవదర్శన్, వినోద్, వెంకట్, రవిందర్, శ్రీనివాస్, సందీప్, మంగేష్, నవీన, పార్థసారథి, శ్రీకాంత్, ధరంసింగ్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మతిస్థిమితం లేని వృద్ధురాలు మృతి

ఇచ్చోడ: మండలంలోని మల్యాల్ గ్రామానికి చెందిన భూతి రాజుబాయి (75) అనే మతిస్థిమితం లేని వృద్ధురాలు పత్తి చేనులో మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాజుబాయి డిసెంబర్ 30న ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో డిసెంబర్ 31న పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈక్రమంలో బుధవారం అదే గ్రామానికి చెందిన చాహకటి ఈశ్వర్ పత్తి చేనులో వృద్ధురాలు మృతి చెంది ఉన్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గొల్లపేట్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతుడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందని, మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సంజీవయ్య కాలనీకి చెందిన మహంకాళి శ్రీనివాస్(50) తన అన్నయ్య మహంకాళి అంజయ్యతో కలిసి పని మీద స్థానిక ఐబీ చౌరస్తాకు వెళ్లాడు. అక్కడ శ్రీనివాస్ కాలినడకన రోడ్డు దాటుతుండగా శ్రీరాంపూర్ వైపు నుంచి అతి వేగంగా వచ్చిన టాటా ట్రాలీ బలంగా ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు భార్య శ్యామల, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్యామల ఫిర్యాదు మేరకు ట్రాలీ డ్రైవర్ ఎండీ ఫిరోజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

నేడు నాగోబా జాతర నిర్వహణపై సమీక్ష

ఇంద్రవెల్లి: ఈ నెల 28న మెస్రం వంశీయుల మహాపూజతో ప్రారంభించనున్న నాగోబా జాతర నిర్వహణపై కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో గురువారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి ప్రకటనలో తెలిపారు. నాగోబా దర్బార్ హాల్‌లో సమావేశం మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, మెస్రం వంశీయులు హాజరు కావాలని ఆయన కోరారు.

సమయానికి చేరదేమి..!

ఓ మండలానికి చెందిన దంపతులు నిర్మల్ బస్టాండ్‌లో సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్ వెళ్లే బస్సు ఎక్కారు. బస్సు రాత్రి 10 గంటలకు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్‌స్టేషన్‌కు చేరుకోవాల్సి ఉండగా, గంట 15 నిమిషాలు ఆలస్యంగా 11.15 గంటలకు చేరుకుంది. ఆ దంపతులే డిసెంబర్ 26వ తేదీన తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4.20 గంటలకు ఎంజీబీఎస్‌లో బస్సు ఎక్కారు. మార్గమధ్యలో బస్సును ఓ దాబా వద్ద దాదాపు 40 నిమిషాల పాటు ఆపారు. నిర్మల్‌కు రాత్రి 10 గంటలకు చేరుకోవాల్సిన బస్సు రాత్రి 11.30 గంటలకు చేరుకుంది. దీంతో సదరు దంపతులు సంవత్సరం వయస్సు ఉన్న వారి పాపతో చలిలో ఇబ్బందులు పడ్డారు.


తుప్రాన్ వద్ద గల ఓ దాబా ఎదుట ఆగిన బస్సు

- హైదరాబాద్‌కు సకాలంలో చేరుకోని బస్సులు
- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు రావడంలో సైతం ఆలస్యం
- గంటన్నర లేట్ అవుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

హైదరాబాద్‌కు వెళ్లే బస్సుల వివరాలు..

నిర్మల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు (నిర్మల్ డిపో) : 29
ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు (ఆదిలాబాద్ డిపో) : 23

బోథ్: ఆర్టీసీ అంటేనే ప్రజల్లో ఓ నమ్మకం. ఆర్టీసీ బస్సులు సురక్షితం.. అనే భావన ప్రజల్లో ఉంది. డ్రైవర్లు, సిబ్బంది ప్రజలతో మమేకమవుతూ సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తున్నారు. కాగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన బస్సులు హైదరాబాద్‌కు చేరుకోవడానికి, హైదరాబాద్ నుంచి జిల్లాలకు రావడానికి చాలా ఆలస్యమవుతోంది. జిల్లాల్లో తిరిగే బస్సులు సమయానికి గమ్యస్థానాలు చేరుకుంటున్నా హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే ఆదిలాబాద్, నిర్మల్ డిపోలకు చెందిన బస్సులు మాత్రం సమయానికి చేరుకోవడం లేదు. బస్సులు గమ్యస్థానానికి చేరుకోవాల్సిన సమయం కన్నా ఏకంగా గంటన్నర ఆలస్యంగా చేరుకోవడంతో ప్రయాణికులు అసహనానికి గురవుతున్నారు. హైదరాబాద్‌లో పని నిమిత్తం వెళ్లే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో బస్సులు సమయానికి చేరుకోకపోవడంతో తమ గ్రామాలకు వెళ్లే చివరి బస్సులను అందుకోలేకపోతున్నామని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ఆలస్యానికి పలు కారణాలు..

జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన బస్సులు, అక్కడి నుంచి రావాల్సిన బస్సులు ఆలస్యంగా రావడంలో అనేక కారణాలు ఉన్నాయి. బస్టాండ్‌లో బస్సు పాయింట్ వద్ద బస్సు సమయానికి ప్రారంభం కాకపోవడం.. హై దరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల వల్ల ఆలస్యంగా వస్తున్నాయి. ఎంజీబీఎస్ నుంచి జేబీఎస్ వరకు రావాలంటే గంట సమయం పడుతోంది. దీనికితోడు సుచిత్ర, కొంపల్లి, మేడ్చల్ వద్ద ఫ్లైఓవర్‌లు నిర్మాణంలో ఉండటంతో ట్రాఫిక్ భారీగా ఉంటోంది. దీనివల్ల బస్సులు సమయానికి గమ్యస్థానాలు చేరుకోవడం లేదు.

దాబాల వద్ద..

మార్గమధ్యలో భోజనం చేయడానికి బస్సులను పలు దాబాలు, హోటళ్ల వద్ద దాదాపు 40 నిమిషాల పాటు ఆపుతున్నారు. దీనివల్ల కూడా ఆలస్యం జరుగుతోంది. ప్రయాణికులు మూత్రవిసర్జన కోసం, భోజనం కోసం ఆపాలని కోరుతున్నట్లు పలువురు డ్రైవర్లు పేర్కొంటున్నారు. అయితే బస్సులను మూత్రశాలలు సరిగా లేని, భోజనం నాణ్యతగా లేని హోటళ్లు, దాబాల వద్ద ఆపుతున్నారని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

రోడ్డు పనులతో ఆలస్యం..

రోడ్డు పనుల కారణంగా ఆదిలాబాద్, నిర్మల్‌ల నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి, అక్కడి నుంచి తిరుగు ప్రయాణానికి కొంత ఆలస్యం జరుగుతోంది. మేడ్చల్, కొంపల్లి, సుచిత్ర వద్ద ఫ్లైఓవర్‌లు నిర్మాణంలో ఉన్నాయి. ట్రాఫిక్ వల్ల కూడా ఆలస్యమవుతోంది. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– ప్రవీణ్ కుమార్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం, ఆదిలాబాద్

దుబాయ్‌లో జిల్లావాసి వెతలు

- పక్షవాతంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జైరామ్
- స్వగ్రామానికి పంపే ఏర్పాట్లు చేస్తున్న మైగ్రేంట్స్ ఫోరం ప్రతినిధులు


దుబాయ్‌లో చికిత్స పొందుతున్న జైరామ్

నిర్మల్‌ఖిల్లా: పొట్ట చేతపట్టుకొని ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్తున్న జిల్లావాసులు వివిధ కారణాల రీత్యా అనారోగ్యం బారిన పడుతున్నారు. నిర్మల్ జిల్లా సర్సాపూర్ –జి మండలం గొల్లమాడ గ్రామానికి చెందిన కేసారం జైరామ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అతను పక్షవాతం బారినపడడంతో అక్కడి యాజమాన్యం ఆసుపత్రిలో చేర్పించింది. ప్రస్తుతం చికిత్స కొనసాగుతుండగా కుటుంబ సభ్యులకు అతని ఆచూకీ తెలియక గతకొన్ని రోజులుగా ఆందోళన చెందారు. అక్కడి మైగ్రేంట్స్ రైట్స్ వెల్ఫేర్ ఫోరం, దుబాయ్ శాఖ సమన్వయకర్త జంగం బాలకిషన్, ప్రతినిధి కోటపాటి నరసింహానాయుడుల చొరవతో బాధితుడి పూర్తి వివరాలను సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చికిత్స పొందుతున్న జైరామ్‌ను కుటుంబ సభ్యులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడించారు. ఆరోగ్యం మెరుగైన అనంతరం ఇండియాకు పంపేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్లు మైగ్రేంట్స్ ఫోరం ప్రతినిధులు బుధవారం వెల్లడించారు.

రిమ్స్ నుంచి రిమాండ్ ఖైదీ పరారీ

ఆదిలాబాద్‌టౌన్: అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రిమాండ్ ఖైదీ మంగళవారం అర్ధరాత్రి తర్వాత పరారయ్యాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్‌కు చెందిన ఖైదీ ఇటీవల పోక్సో రేప్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. నిర్మల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అనారోగ్యం బారిన పడడంతో జైలు అధికారులు డిసెంబర్ 27న జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకొచ్చారు. ఎస్కార్ట్ ఉన్నప్పటికీ వారి కళ్లు కప్పి ఖైదీ పరారైనట్లు నిర్మల్ ఏఆర్ ఏఎస్సై ఉయిక లల్లు పేర్కొన్నాడు. ఆయన మావల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు.

నిర్మల్ క్లబ్‌పై పోలీసుల దాడి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నిర్మల్ క్లబ్‌పై మంగళవారం అర్ధరాత్రి పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. ముందస్తు అనుమతులు లేకుండా రాత్రి 11 గంటల ప్రాంతంలో నిర్వాహకులు డిసెంబర్ 31 వేడుకలు జరిపారు. యువతులను రప్పించి ఆటపాటలు నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు క్లబ్‌పై దాడి చేశారు. చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగేలా భారీ శబ్దాలతో డీజే నిర్వహించడంతో పాటు అనుమతి లేకుండా ఆర్కెస్ట్రా నిర్వహించినందుకు నిర్మల్ క్లబ్ నిర్వాహకులు ఎర్రవోతు రాజేందర్, ఇతరులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

అడవి కుక్కలదాడి.. 55 మేకలు మృతి

కోటపల్లి: మేకల మందపై అడవి కుక్కలు దాడిచేయడంతో 55 మేకలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. నక్కలపల్లి గ్రామానికి చెందిన ముల్కల్ల వెంకటి మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న 140 మేకలను రోజులాగే బుధవారం గ్రామ శివారులోని ఆటవీ ప్రాంతంలోకి మేతకు తీసుకెళ్లాడు. ఒక్కసారిగా అడవికుక్కలు మేకల గుంపుపై దాడిచేయగా 55 మేకలు మృత్యువాత పడగా 22 మేకలు కనిపించకుండా పోయాయి. సుమారు రూ.6లక్షల విలువ గల జీవాలు మృతిచెందినట్లు బాధితుడు వాపోయాడు. అధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని వేడుకున్నాడు.


మేకల కళేబరాలు

చికిత్స పొందుతూ రైతు మృతి

తిర్యాణి: పురుగుల మందు తాగిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం చింతపెల్లి పంచాయతీ పరిధి ఇర్కపెల్లి గ్రామనికి చెందిన కుడ్మెత మారుతి(35) అనే రైతు అప్పుల బాధ తాళలేక గత నెల 28న ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మంచి ర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంతర్జాతీయ కథల పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


శ్రీవేద

ఆదిలాబాద్‌టౌన్ (జైనథ్): కేరళకు చెందిన అంతర్జాతీయ పిల్లల మాసపత్రిక గడుగ్గాయి సంక్రాంతి సందర్భంగా కథల పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించింది. జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గాజంగుల శ్రీవేద రాసిన 'ఒకరికొకరు' అనే కథ రెండో బహుమతికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ బుధవారం తెలిపారు. విద్యార్థినికి ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరో విద్యార్థి రాంచరణ్ రాసిన 'తెలివైన కోడి' కథకు ప్రత్యేక బహుమతి లభించిందన్నారు.

బాసరలో భక్తుల రద్దీ


బారులుదీరిన భక్తులు

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజామున అమ్మవారికి విశేష అభిషేకం, అర్చన, పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్‌లో బారులుదీరారు. అక్షరాభ్యాస మండపాలు చిన్నారులతో కిటకిటలాడాయి. కాగా ముధోల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తాలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. – బాసర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు


అమ్మవారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఘనంగా భీమా కోరెగావ్ విజయోత్సవం

ఇంద్రవెల్లి: మండలంలోని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ, భీం ఆర్మీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో భీమా కోరెగావ్ విజయోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహంతో పాటు 1818 జనవరి 1న జరిగిన పెష్వా యుద్ధంలో వీరమరణం పొందిన మహర్ వీర సైనికుల స్మారకంగా ఏర్పాటు చేసిన స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితుల బౌద్ధ ఉపాసకుల ఆధ్వర్యంలో పంచశీల్, త్రిషరణ్, బుద్ధవందన, ధమ్మవందన, సంఘవందన తీసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, మాజీ ఎంపీపీ కనక తుకారం, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మరే, ఉపాధ్యక్షుడు శివాజీ పవార్, ఆయా పార్టీలు, ఆయా సంఘాల నాయకులు ఆర్క ఖమ్ము, దిలీప్ మోరే, రాథోడ్ అనిల్, ఎండీ మసుద్, ఉత్తం, లహుదాస్, మస్కే రాజువర్ధన్ తదితరులు ఉన్నారు.


ప్రార్థన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

నేడు జంగుబాయి క్షేత్రంలో దీపోత్సవం


పూజలు చేసే జెండాలు


జంగుబాయి గుహ ఎదుట ఉండే మైసమ్మ

కెరమెరి: జంగుబాయి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆదివాసీలు భక్తిశ్రద్ధలతో దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఎనిమిది గోత్రాల కటోడాలు, ఆదివాసీలు ఆలయ సన్నిధిలో కొలువుదీరిన దేవతా విగ్రహాలను టొప్లకస నుంచి తీసుకవచ్చిన గంగాజలంతో శుద్ధి చేస్తారు. అనంతరం రావుడ్, పోచమ్మ ఆలయంలోని ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశాక అమ్మవారి గుహకు చేరి దీపం వెలిగిస్తారు. కమిటీ సభ్యులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

మందు బాబులపై పోలీసుల కొరడా

ఆదిలాబాద్‌టౌన్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన వారిపై మంగళవారం రాత్రి పోలీసులు కొరఢా ఝుళిపించారు. ఆదిలాబాద్ పోలీసు డివిజన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరిమితికి మించి శబ్దంతో వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

భీమారంలో..

భీమారం: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ తెలిపారు. మంచిర్యాల– చెన్నూరు జాతీయరహదారిపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

10 మందిపై కేసు..

లక్ష్మణచాంద: మండలంలో 10 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి ఎస్సై సుమలత ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన మొత్తం 10 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సుమలత తెలిపారు.

మహాత్మునికి అవమానం


గాంధీ విగ్రహం నోట్లో సిగరెట్ పెట్టిన యువకులు


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

- మద్యం మత్తులో యువకుల దుశ్చర్య
- కేసు నమోదు.. పలువురి అరెస్ట్

నిర్మల్‌రూరల్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 31 అర్ధరాత్రి వేళ.. కొందరు యువకులు తప్పతాగి గాంధీ విగ్రహాన్ని అవమానించారు. ఈ ఘటన నిర్మల్ రూరల్ మండలం నీలాయిపేటలో జరిగింది. స్థానికులు, రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా నీలాయిపేట గ్రామంలో పలువురు యువకులు వేడుకలు నిర్వహించారు. డీజే, ఆటపాటలతో సంబరాలను నిర్వహించారు. పక్క గ్రామమైన అనంతపేటకు చెందిన పలువురు యువకులు అదే సమయంలో తప్పతాగి పక్కనే ఉన్న జాతీయ రహదారిపైకి వెళ్తూ నీలాయిపేటలో కాసేపు ఆగారు. అక్కడ ఉన్న యువకులతో వాగ్వివాదం పెట్టుకున్నారు. అంతటితో ఆగకుండా బస్టాండ్‌లో ఉన్న గాంధీ విగ్రహాన్ని అవమానం కలిగించారు. విగ్రహం నోట్లో సిగరెట్ పెట్టి, బీడీ కట్ట విగ్రహం పక్కన ఉంచారు. విగ్రహం పక్కన ఉన్న జెండాలు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరుకోవడంతో పరారయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఏఎస్పీ రాజేశ్‌మీనా, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై లింబాద్రి బుధవారం గ్రామానికి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మహాత్ముడిని అవమానించిన అనంతపేటకు చెందిన 9 మంది యువకులను గుర్తించారు. 8 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరొకరు పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ ప్రమాదం.. తీరని శోకం


మంద రాజు (ఫైల్)


పవన్‌కల్యాణ్ (ఫైల్)

దండేపల్లి: బైక్ ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మణం చెందడం.. రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. దండేపల్లి మండల కేంద్రం సమీపంలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు బైక్ కాలువలో పడ్డ ఘటనలో దండేపల్లికి చెందిన మంద రాజు(35), జిల్లపెల్లి పవన్‌కల్యాణ్(23) మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా వారి మృతితో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

అమ్మ, నాన్నలేని అనాథగా..

మందరాజు మృతి చెందడంతో ఐదో తరగతి చదువుతున్న అతని కూతురు హర్షిత అమ్మా, నాన్నలేని అనాథగా మారింది. రెండేళ్ల క్రితం రాజు భార్య కమల అనారోగ్యంతో మృతి చెందింది. ఇప్పుడు రాజు సైతం మృతిచెందాడు. దీంతో ఆయన కూతురు హర్షిత రోదనలు మిన్నంటాయి. రాజుకు తల్లి బాలమ్మ ఉంది. ఇతనిది నిరుపేద కుటుంబం కావడంతో కాలనీవాసులే అంత్యక్రియలు నిర్వహించారు.

నెల క్రితమే వివాహం..

జిల్లపెల్లి చంద్రమౌళి –సువర్ణ దంపతులకు పవన్‌కల్యాణ్‌తో పాటు కూతురు ఉంది. కూతురుకు వివాహం చేశారు. పవన్‌కల్యాణ్‌కు నెల క్రితమే వివాహం జరిగింది. కుటుంబానికి అండగా నిలిచే కుమారుడు బైక్‌ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ (34) అనే యువకుడు బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మాలిక్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నా తగ్గకపోవడంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి


తోట గంగాధర్ (ఫైల్)

వాంకిడి: చికెన్ కొనేందుకు మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా సర్సాపూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన తోట గంగాధర్(29) కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని ఖమాన గ్రామంలో గల తేలివాడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించేవాడు. ఈక్రమంలో ఖమానా గ్రామంలోనే ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. కాగా 6 నెలల క్రితం గంగాధర్‌కు ప్రమోషన్ రావడంతో నవేగూడ ప్రైమరీ స్కూల్ హెచ్ఎంగా బదిలీ అయ్యాడు. ఖమాన గ్రామంలోనే ఉంటూ విధులకు హాజరయ్యేవాడు. బుధవారం సాయంత్రం చికెన్ కొనేందుకు వాంకిడి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఖమాన గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వాంకిడి వైపు వెళ్తున్న కొందరు వ్యక్తులు ద్విచక్రవాహనం పడి ఉండటాన్ని గమనించారు. గంగాధర్ తలకు తీవ్రమైన గాయాలతో పడి ఉన్నాడు. వెంటనే ఆయనను అంబులెన్స్‌లో వాంకిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆసిఫాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఎస్సై ప్రశాంత్‌ను సంప్రదించగా రోడ్డు ప్రమాదంపై ఇంకా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.